సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం, 30, జూన్, 2025

బోనమో పోచమ్మ

బోయినపల్లి(వేములవాడ): ఆషాఢమాసం ఆదివారం కావడంతో జిల్లా ప్రజలు పోచమ్మతల్లికి బోనం మొక్కులు చెల్లించుకుంటున్నారు. మండలంలోని కొదురుపాక, తడగొండ గ్రామాల్లో పోచమ్మబోనాలు తీశారు. బైండ్లవాళ్ల గాంగ్రింపులు..డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివచ్చారు. బోనం మొక్కు చెల్లించుకున్నారు.



న్యూస్‌రీల్

రేపటి నుంచి పీఎం ధర్తీ ఆబాజన్ గ్రామసభలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో ఎంపిక చేసిన గిరిజన గ్రామాల్లో జూలై 1 నుంచి 5 వరకు పీఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం తెలిపారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల, గర్జనపల్లి, రుద్రంగి మండలం మానాల గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, ఆహార భద్రతకార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కిసాన్ క్రెడిట్‌కార్డ్, పీఎం కిసాన్, జనధన అకౌంట్, జాబ్‌కార్డ్, కులం సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కవరేజీ మొదలగు అర్హులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. మద్దిమల్లతండా, సీతారామనాయక్‌తండా, జవహర్‌లాల్‌నాయక్‌తండా, రుద్రంగి మండలం వీరునితండా, అడ్డబోర్‌తండా, దెగావత్‌తండా, గైదిగుట్టతండా, రూప్లానాయక్‌తండా, సర్పంచ్‌తండా, మానాల, బడితండా, చింతామణి తండాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శాస్త్రవిజ్ఞాన ఫలాలు ప్రజలకు అందాలి



సిరిసిల్లఅర్బన్: శాస్త్ర విజ్ఞాన ఫలాలు ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మార్వాడి గంగరాజు పేర్కొన్నారు. రంగినేని ట్రస్టులో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వారం లక్ష్మీనారాయణ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు, నాయకులు శ్రీహరి, మధుసూదన్, బుర్కా గోపాల్, కిషన్, రాజయ్య పాల్గొన్నారు.

రేపు ట్రయథ్లాన్ సెలక్షన్స్

సిరిసిల్లటౌన్: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ట్రయథ్లాన్ సెలక్షన్స్ జూలై 1 నుంచి సిరిసిల్ల ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలకు జిల్లా అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ఆజాద్‌ను, 79014 64456, 94414 56385, 93928 80231లలో సంప్రదించాలని కోరారు.

జాతీయ బీసీ మహిళా కమిటీ



ఇల్లంతకుంట(మానకొండూర్): విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కుల కోసం బీసీ మహిళలే కీలకపాత్ర పోషిస్తారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల పరుశరాములు పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండల జాతీయ మహిళా బీసీ సంక్షేమ సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షురాలిగా తీగల పుష్పలత, ప్రధాన కార్యదర్శిగా ముత్యం భాగ్యలక్ష్మిని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గుంటి మహేశ్, ప్రధాన కార్యదర్శి బత్తిని స్వామిగౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగారం కొమురవ్వ, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షురాలు బాద పోషవ్వ పాల్గొన్నారు.

క్రికెట్ ప్రిలిమినరీ సెలెక్షన్స్

సిరిసిల్లటౌన్: క్రికెట్ ప్రిలిమినరీ జట్టు ఎంపిక పోటీలు జూలై 2న రైజింగ్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్మాణి రాంలింగారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 1 నాటికి 15 ఏళ్లు నిండిన వారు ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు, 2 ఫొటోలు, సొంత కిట్‌బ్యాగ్, వైట్‌డ్రెస్‌లో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 80081 05202, 84979 79747, 94405 44177, 96669 73144, 99486 70989, 98669 85666, 72859 95853, 91772 59935, 70133 04761లలో సంప్రదించాలని కోరారు.

ఉచితంగా డేటా ఇంజినీర్ కోర్సు శిక్షణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఉచితంగా డేటా ఇంజినీర్ కోర్సు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బూర రవీందర్ ఆదివారం తెలిపారు. బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ పట్టభద్రులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి బేసిక్ అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్‌క్యూఎల్, బీఐ టూల్స్‌తోపాటు సాఫ్ట్‌స్కిల్స్‌ను 90 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల యువత www.sethu.ai వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 90523 72023లో సంప్రదించాలని కోరారు.

గడువులోగా గగనమే !

- ఈనెలాఖరులోగా సగం బట్ట ఉత్పత్తి అసాధ్యం
- ఇందిరా మహిళాశక్తి చీరల ఆర్డర్లు 4.30కోట్ల మీటర్లు
- ఇప్పటికీ ఉత్పత్తి 80 లక్షల మీటర్లు
- ఇంకా 3.50 కోట్ల మీటర్లు ఉత్పత్తి చేయాలి
- కార్మికుల కొరత.. నాణ్యత మెలిక



వస్త్రోత్పత్తిదారుల ఇళ్లలో మహిళా శక్తి చీరల బట్టను పరిశీలిస్తున్న మహిళలు



సిరిసిల్ల గోదాములో చీరల బట్టను తనిఖీ చేస్తున్న టీఏలు

సిరిసిల్ల: మహిళా శక్తి చీరల ఉత్పత్తి నత్తకు నడక నేర్పేలా సాగుతోంది. ఈనెలాఖరులోగా సగం లక్ష్యం పూర్తి చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది. సిరిసిల్లలో 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (మ్యాక్స్) సంఘాల పరిధిలో 27వేల మరమగ్గాలు ఉండగా.. 6972 సాంచాలపైనే చీరల బట్ట ఉత్పత్తి అవుతుంది. మిగతా సాంచాలపై పాలిస్టర్ బట్ట ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణంగా.. స్థానికంగా కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చినా సరిపోవడం లేదు. దీంతో నిత్యం సిరిసిల్లలో 9.85 లక్షల మీటర్లు ఉత్పత్తి చేయాల్సి ఉండగా ప్రస్తుతం 4.18 లక్షల మీటర్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 17న కలెక్టరేట్‌లో రాష్ట్ర చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ వస్త్రోత్పత్తిదారులతో సమావేశమయ్యారు. ఈనెలాఖరులోగా 50 శాతం పూర్తి చేసిన సొసైటీలకే ఆర్డర్ ఇస్తామని స్పష్టం చేశారు. అయితే చీరల ఉత్పత్తి తీరును పరిశీలిస్తే ఈనెలాఖరులోగా 25 శాతం ఉత్పత్తి కూడా అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

కార్మికుల కొరత

సిరిసిల్లలో నేతకార్మికుల కొరత వేధిస్తోంది. ఇటీవల స్థానిక వస్త్రపరిశ్రమలో సంక్షోభంతో చాలా మంది నైపుణ్యం గల కార్మికుల ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. గతంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేసిన వారు కూడా స్థానికంగా ఉపాధి లేక వారి స్వస్థలాల్లోనే పనులు చేసుకుంటున్నారు. దీంతో స్థానిక వస్త్రపరిశ్రమలో నైపుణ్యం గల కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. చాలీచాలని వేతనాలతో స్థానిక కార్మికులు సైతం వస్త్రోత్పత్తి పనికి రావడం లేదు. గతంలో బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేసిన కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీని అందించారు. అప్పట్లో అందరికీ ఈ సబ్సిడీ ఇవ్వడంతో ఆసక్తిగా బతుకమ్మ చీరల బట్టను ఉత్పత్తి చేశారు. కానీ ఇప్పుడు పొరుగు రాష్ట్రాల కూలీలకు కేవలం మీటరుకు రూ.5.25 కూలీ చెల్లిస్తున్నారు. 10 శాతం యారన్ సబ్సిడీ వర్తించడం లేదు. దీంతో పొరుగు రాష్ట్రాల కార్మికులు తప్ప స్థానికులు పనికి రావడం లేదు.

ఆగస్టులో చీరల పంపిణీ అసాధ్యమే..

రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులకు ఏటా రెండు చీరలను ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతేడాది ఆగస్టు 8న చేనేత దినోత్సవం రోజు ప్రకటించారు. ఆ మేరకు ఈ ఏడాది ఆగస్టులో చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుండగా.. చీరల బట్ట పూర్తిస్థాయిలో ఉత్పత్తి అసాధ్యంగా కనిపిస్తుంది. కనీసం ఒక్క చీరనైనా అందించే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. సిరిసిల్లలో ఉత్పత్తి అయిన చీరల బట్టను ప్రాసెసింగ్ చేసి, రంగుల్లో ప్రింటింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలంటే మరో నెల రోజులు పడుతుందని భావిస్తున్నారు.

నాణ్యతపై తనిఖీలు

ఇందిరా మహిళాశక్తి చీరల బట్ట సేకరణను ఈనెల 23న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రారంభించారు. ఆసాముల వద్ద ఉత్పత్తి అయిన బట్టను యజమానులు సేకరించే సమయంలోనే డ్యామేజీ లేకుండా పరిశీలిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ గోదాములోనూ చీరలబట్టను అన్ని కోణాల్లో తనిఖీ చేస్తున్నారు. 48 ఇంచుల వెడల్పుతో ఉండేలా చూస్తున్నారు. డిజైన్లు సరిగా వస్తున్నాయో లేవో కూడా చెక్ చేసుకోవాలంటున్నారు. గతంలో కంటే నాణ్యమైన చీరల ఉత్పత్తి జరుగుతున్నా గడువులోగా లక్ష్యం చేరడం కష్టంగా కనిపిస్తుంది.



సిరిసిల్లలో సాంచాలపై ఇందిరా మహిళాశక్తి చీరల బట్ట ఉత్పత్తి

సాంచాల సంఖ్య పెరగాలి



సిరిసిల్లలో మహిళాశక్తి చీరల బట్టను ఉత్పత్తి చేసే సాంచాల సంఖ్య పెరగాల్సి ఉంది. ఇప్పుడే పూర్తి స్థాయిలో బట్ట ఉత్పత్తి జరుగుతుంది. మేమూ మా సిబ్బంది కార్ఖానాల్లో పర్యటిస్తూ చీరలబట్ట ఉత్పత్తిని పరిశీలిస్తున్నాం. ఇంకా సాంచాల సంఖ్య పెరగడంతోపాటు రేయింబవళ్లు చీరల బట్ట ఉత్పత్తి అయితేనే లక్ష్యం సాధ్యమవుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– రాఘవరావు, చేనేత, జౌళిశాఖ ఏడీ

చీరల బట్ట ఆర్డర్ల స్వరూపం

మొదటి ఆర్డర్ .. జనవరిలో	2.12 కోట్ల మీటర్లు
రెండో ఆర్డర్ .. మార్చిలో	2.18 కోట్ల మీటర్లు
ప్రస్తుతం నడుస్తున్న సాంచాలు	6,972
ఉత్పత్తి అయిన చీరల బట్ట	80 లక్షల మీటర్లు
గోదాముకు చేరిన వస్త్రాలు	10 లక్షల మీటర్లు
నిత్యం ఉత్పత్తి అవుతున్న బట్ట	4.18 లక్షల మీటర్లు
నిత్యం ఉత్పత్తి చేయాల్సిన లక్ష్యం	9.85 లక్షల మీటర్లు
జూన్ నెలాఖరులోగా ఉత్పత్తి అయ్యేది	కోటి మీటర్లు

నిధులు లేక నిరాధరణ



కాలంచెల్లిన కవర్లతో ఫిష్ పాండ్స్

- నీరసించిపోతున్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం
- శిథిలావస్థలో భవనం.. ఫిష్‌పాండ్స్
- 50 ఏళ్ల క్రితం 16 ఎకరాలలో ఏర్పాటు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తుప్పు పట్టిపోతున్న సామగ్రి

గంభీరావుపేట(సిరిసిల్ల): నిధుల కొరత.. పాలకుల నిర్లక్ష్యానికి జిల్లాలోని ఏకైక చేపపిల్లల ఉత్పత్తికేంద్రం నిరాధరణకు గురవుతుంది. 50 ఏళ్ల క్రితం నర్మాల ఎగువమానేరు జలాశయంలోని నీటిని ఆధారం చేసుకొని దాదాపు 16 ఎకరాల్లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆఫీస్ భవనం, ఫిష్‌పాండ్స్ శిథిలావస్థకు చేరాయి. కార్యాలయంలోని సామగ్రి పాడైపోయింది. అక్కడికి వెళ్లేందుకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదు. ఇక్కడ మూడేళ్లుగా చేపపిల్లల ఉత్పత్తి, పెంపకం నిలిచిపోయింది. ఫిష్‌పాండ్స్ పగుళ్లుబారాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టార్పాలిన్ కవర్లకు సైతం కాలం చెల్లిపోయింది.

పాడైపోతున్న సామగ్రి

ఏటా వేలాది చేపపిల్లలను ఉత్పత్తి చేసి తక్కువ ధరకు మత్స్యకారులకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన కేంద్రం పాలకుల నిర్లక్ష్యానికి గురవుతుంది. భవనాలు, ఫిష్‌పాండ్స్, సామగ్రి పాడైపోతున్నాయి. ఏళ్ల తరబడి నిధులు లేక మరమ్మతులకు నోచుకోవడం లేదు. కేంద్రాన్ని పునరుద్ధరిస్తే స్థానిక మత్స్యకారులకు, రైతులకు ఎంతో మేలు కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాతపాండ్స్‌ను తొలగించి కొత్తవి నిర్మించి చేపపిల్లల ఉత్పత్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. మత్స్యకారులకు శిక్షణ కేంద్రంగా సైతం అభివృద్ధి చేయవచ్చు. గతంలో కేంద్రం పునరుద్ధరణకు అధికారులు రూ.60లక్షల అంచనాతో ప్రతిపాదనలు పంపినా మరమ్మతుకు నోచుకోలేదు.

ప్రభుత్వ స్పందన కోసం చూస్తున్నాం



కోళ్లమద్దిలోని చేపపిల్లల ఉత్పత్తి, పెంపకం కేంద్రం పునరుద్ధరణపై ప్రభుత్వం నుంచి స్పందన కోసం ఎదురుచూస్తున్నాం. పునరుజ్జీవం పోస్తే ఒక్క గంభీరావుపేట మండలానికే కాకుండా చుట్టుపక్కల మండలాలు, జిల్లాలోని మత్స్యకారులకు లాభం చేకూరే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– గాడిచర్ల శ్రీనివాస్, మత్స్యసహకార సంఘం జిల్లా డైరెక్టర్, గంభీరావుపేట

కోడెలను సంరక్షించుకోవాలి

- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- రాజన్న గోశాలలో 137 జతల కోడెలు పంపిణీ



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడఅర్బన్: రాజన్న కోడెలను రైతులు జాగ్రత్తగా సంరక్షించుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు పరిశీలించారు. అర్హులైన రైతులకు 137 జతల కోడెలను ఆదివారం పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజన్న ఆలయ ఈవో రాధాభాయి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాలను సందర్శించిన మానిటరింగ్ కమిటీ

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ వైద్యకళాశాల, అనుబంధ బోధన ఆస్పత్రిని ఆదివారం మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ బృందం(ఎంసీఎంసీ) సభ్యులు సందర్శించారు. వైద్యకళాశాల, అనుబంధ బోధన ఆసుపత్రిని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న భవనం, హాస్టల్ బిల్డింగ్, క్రిటికల్ కేర్ యూనిట్, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ క్వార్టర్స్, అతిథిగృహం త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ బోధన ఆస్పత్రిని తనిఖీ చేసి సదుపాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వైద్యవిద్యా సంచాలకులు డాక్టర్ శివరాం ప్రసాద్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డాక్టర్ దావూద్ సులేమాన్, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ విశ్వప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మీనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించిన మానిటరింగ్ కమిటీ సభ్యులు

లోలెవల్ కష్టాలు తీరేదెప్పుడో?

- కల్వర్టులపై నుంచి పారుతున్న వరద
- వర్షాకాలంలో నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



- ఇది ఎల్లారెడ్డిపేట మండలం పదిర–రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య గల మానేరు వాగుపై ఉన్న లోలెవల్ వంతెన. గతంలో కురిసిన వరదనీటితో కల్వర్టు కొట్టుకుపోవడంతో ప్రస్తుతం మానేరువాగుపై తాత్కాలికంగా రోడ్డు వేశారు. రూ.50కోట్లతో వంతెన నిర్మించాలన్న ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఫలితంగా ఏటా వర్షాకాలంలో మానేరువాగు పొంగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మించాలనే డిమాండ్ ఉంది.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి శివారులోని లేతమామిండ్లవాగుపై ఉన్న లోలెవల్ కల్వర్టుపై నుంచి పారుతున్న వరదనీరు. చిన్నపాటి వర్షానికి ఇక్కడ వరద వచ్చి మండల కేంద్రానికి అక్కపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోతుంటాయి. అంతేకాకుండా కోనరావుపేట–ఎల్లారెడ్డిపేట మండలాల మధ్య సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ వాగుపై వంతెన నిర్మించాలన్న విన్నపాలు నెరవేరడం లేదు. ఇలాంటి పరిస్థితులు జిల్లా వ్యాప్తంగా 95 లోలెవల్ కల్వర్టుల వద్ద ఉంది. ఏటా వర్షాకాలంలో లోలెవల్ కల్వర్టుల కష్టాలు తీరడం లేదు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వర్షాకాలం వచ్చిందంటే జిల్లాలో 95 లోలెవల్ కల్వర్టుల వద్ద వరద పొంగి ప్రవహిస్తుంటుంది. ఫలితంగా పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. కొన్నేళ్లుగా ఈ సమస్య ఎదురవుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా 1,636 రహదారులుండగా.. 95 రహదారులపై గల లోలెవల్ కల్వర్టులపై నుంచి నీరు పారుతోంది. చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్ మండలాల్లో వరదకష్టాలు ఎక్కువగా ఉన్నాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల మధ్య సమన్వయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణం నరకం

- ఎల్లారెడ్డిపేట మండలం పదిర, ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లి మధ్య మానేరు వాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. మానేరువాగుపై వంతెన నిర్మాణానికి సుమారు రూ.50కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అక్కపల్లి వద్ద వాగు పొంగుతుండడంతో ప్రతీ సీజన్‌లో రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలంలోనే నాలుగు రూట్‌లలో 8 లోలెవల్ కల్వర్టులతో 17 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

జిల్లాలో రోడ్ల వివరాలు

రోడ్ల విస్తీర్ణం	595.869 కిలోమీటర్లు
బీటీ రోడ్లు	570.061 కిలోమీటర్లు
మట్టి రోడ్లు	5.05 కిలోమీటర్లు
సీసీ రోడ్లు	20.308 కిలోమీటర్లు
పంచాయతీరాజ్ రోడ్లు	1,041 కిలోమీటర్లు
ఆర్అండ్‌బీ రోడ్లు	595 కిలోమీటర్లు
లోలెవల్ వంతెనలు, కల్వర్టులు	95

ప్రతిపాదనలు పంపాం

పదిర–రామలక్ష్మణపల్లి మధ్య మానేరువాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ఈ వంతెనకు సుమారు రూ.50కోట్లు ఖర్చు అవుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం అంత పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వడానికి సుముఖంగా లేదు. లోలెవల్ కల్వర్టులు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉంటాయి.

– కిరణ్, ఆర్అండ్‌బీ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట

శాశ్వత పరిష్కారం చూపాలి



పదిర–రామలక్ష్మణులపల్లి మధ్య మానేరు వాగుపై వంతెన నిర్మించాలి. శాశ్వత వంతెన నిర్మాణం చేయాలనే సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లోని దాదాపు 30 గ్రామాల ప్రజల విన్నపాలు బుట్టదాఖలవుతున్నాయి. మానేరు వాగుపై గత ఏడాది కురిసిన భారీ వరదలతో కొట్టుకుపోయిన లోలెవల్ కల్వర్టుకు తాత్కాలికంగా మరమ్మతు చేసి వదిలేశారు.

– చల్ల సత్యంరెడ్డి, పదిర

పాలేటివాగుపై వంతెన నిర్మించాలి



నారాయణపూర్–బండలింగంపల్లి మధ్య గల లోలెవల్ కల్వర్టుగా ఉన్న పాలేటివాగుపై వంతెన నిర్మించాలి. ప్రతీ వర్షాకాలంలో వాగు పొంగి పొర్లుతుండడంతో కల్వర్టుపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. నారాయణపూర్ శివారులోని పెద్దమ్మఒర్రెపై వంతెన నిర్మించాలి.

– గొరిటిపల్లి జితేందర్, బండలింగంపల్లి

క్లుప్తంగా

మంత్రి కారు ప్రమాద ఘటనలో ఇద్దరిపై కేసు

● అతివేగం, నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగినట్లు గుర్తింపు



ప్రమాదానికి గురైన మంత్రి కారును టోచన్‌లో తరలిస్తున్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మారుతినగర్ శివారులో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కారు శనివారం ప్రమాదానికి గురైన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మంత్రి అడ్లూరి మెట్‌పల్లిలో పర్యటన ముగించుకుని ధర్మపురి వెళ్తున్న సమయంలో కోరుట్ల వైపు నుంచి టోచన్‌తో వస్తున్న కారు మంత్రి ప్రయాణిస్తున్న కారు టైరుకు తగలడంతో ప్రమాదం జరిగినట్లు గుర్తించామన్నారు. అతివేగం, నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, ఘటనకు కారకులైన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన పాషా, ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



నాగుల వేణు (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన నాగుల వేణు (35) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. వేణు గతంలో గల్ఫ్ వెళ్లి అప్పుల పాలు కావడంతో తిరిగి వచ్చి కూలి పనులు చేసుకుంటున్నాడు. అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముకాస రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరిశంకర్



కరీంనగర్‌టౌన్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చల్ల హరిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నియామకపత్రాన్ని మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా అందించారు. హరిశంకర్ మాట్లాడుతూ మున్నూరు కాపులు రాజకీయాలకు అతీతంగా, అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. మున్నూరు కాపులను సంఘటిత పరచి ఒకే తాటిపైకి తీసుకువెళ్తానని తెలిపారు.

ఖర్చు తక్కువ.. పోషకాలు ఎక్కువ

● ప్రకృతి సేద్యం చేసే రైతుల ఎంపిక
● జగిత్యాల జిల్లాలో 2,500 మంది గుర్తింపు
● పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం



ప్రకృతి సేద్యం కోసం ఆవును పెంచుతున్న రైతు రాములు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయంలో వస్తున్న మార్పులతో పంటల్లో దిగుబడి పెరిగినప్పటికీ.. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కలుపు మందులను పంటలపై విచ్చలవిడిగా వాడుతుండటంతో మనుషుల ఆరోగ్యానికి పెను ప్రమాదంగా మారింది. దీంతో రైతులకు రసాయన ఎరువులపై పెట్టే ఖర్చు భారంగా తయారైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఓ వైపు రైతుల ఖర్చు తగ్గించడంతోపాటు మరోవైపు వినియోగదారులకు మేలైన ఆహారపదార్థాలను అందించేందుకు ప్రకృతి సేద్య పద్ధతులను పాటించాలని అన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖలకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జగిత్యాల జిల్లాలో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల దృష్టి మరల్చేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించింది. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో అవగాహన కార్యక్రమాలతోపాటు వారి తోటలను ప్రదర్శన క్షేత్రాలుగా ఎంపిక చేయనున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు పలు విధాలుగా శిక్షణ ఇచ్చేందుకు నిధులు మంజూరు చేస్తోంది. మరోవైపు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ఎంపిక చేసే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది.

ప్రకృతి సేద్యానికి ప్రభుత్వం ప్రోత్సాహం

ప్రకృతి సేద్యంతో ఓ వైపు ప్రజల ఆరోగ్యానికి భద్రత ఇవ్వడంతోపాటు మరోవైపు రైతులకు లాభం చేకూరేలా ప్రభుత్వం ప్రకృతి సేద్యం చేసే రైతులకు ప్రోత్సాహం అందించనుంది. ముఖ్యంగా సాగులో రసాయన ఎరువులను ఇబ్బడిముబ్బడిగా వాడుతుండడంతో క్యాన్సర్ వంటి రోగాల బారినపడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు సాగుభూములు నిర్జీవంగా మారి పనికి రాకుండా పోతున్నాయి. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ.. రసాయన అవశేషాలు లేని ఆరోగ్యకర ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని చూస్తోంది. ఈ మేరకు రైతులను ఎంపిక చేసి, వారితో రసాయనాలు లేని సేంద్రియ పంటలను పండించాలని సంకల్పించింది. ఇందుకుగాను రెండేళ్లపాటు జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో కార్యాచరణకు సిద్ధమైంది.

2500 మంది ఎంపిక

జగిత్యాల జిల్లాలో సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయించేందుకు ఆసక్తి గల 2500 మంది రైతులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 72 ఏఈఓ క్లస్టర్లు ఉండగా.. అందులో ప్రాథమికంగా 20 క్లస్టర్ల పరిధిలో ఈ పథకాన్ని ప్రస్తుత ఏడాది నుంచి ప్రారంభించనున్నారు. ప్రతి క్లస్టర్ నుంచి 125 మంది రైతులను ఎంపిక చేస్తారు. వీరికి ఎల్‌ఎస్‌ఎఫ్‌ఐ శాస్త్రవేత్తలు, మాస్టర్ ట్రైనర్లు, శిక్షణ పొందిన సీఆర్‌పీలు ప్రకృతి సేద్యంపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రకృతి సేద్య పద్ధతులకు దేశీయ ఆవులు ప్రధానం కాబట్టి ఆవులు ఉన్న రైతులకు ఈ పథకంలో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆవు పేడ, ఆవు మూత్రంతో జీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం తయారుచేసి ఎలాంటి రసాయనాలు, పురుగుమందులు వాడకుండా పంటలు పండించాలన్నది ఈ పథకం ఉద్దేశం.

ప్రకృతి సేద్య స్టాళ్ల ఏర్పాటు

ప్రకృతి సేద్య పద్ధతుల ద్వారా పండించిన పంటలను మార్కెటింగ్ చేసేందుకు ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా కూరగాయలు, భోజనానికి ఉపయోగించే సన్నరకం వరి పంట సాగు చేసే రైతులను తొలుత ఈ పథకంలోకి తీసుకురానున్నారు. వారు పండించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ ఉంటే ఇతర రైతులు కూడా సేంద్రియ పద్ధతులను అనుసరించే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ భావిస్తోంది.

ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను



కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించడంతోపాటు ఈ పద్ధతిలో ఆసక్తి ఉన్న రైతులకు పలు దఫాలుగా శిక్షణ ఇచ్చాను. మామిడి, వరి పంటల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తున్నాను. మంచి ఫలితాలు కన్పిస్తున్నాయి.

– మిట్టపెల్లి రాములు, తుంగూర్

రైతులను ఎంపిక చేస్తున్నాం



సేంద్రియ వ్యవసాయ పథకం కోసం రైతులను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఉత్పత్తుల అమ్మకాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. రసాయన ఎరువులను తగ్గించి, సహజ ఉత్పత్తులు అందించాలన్నది లక్ష్యం.

– భాస్కర్, వ్యవసాయ శాఖ అధికారి, జగిత్యాల

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



వెంకటి మృతదేహం

చందుర్తి(వేములవాడ): ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు ఆదివారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన నేరెళ్ల వెంకటి(72) ఈనెల 11న తన ఇంటి ముందర కూర్చోగా.. అదే మండలం నర్సింగపూర్‌కు చెందిన పూడూరి భరత్ బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వృద్ధుడు రెండు కాళ్లు, చేతు విరగ్గా, తలకు బలమైన గాయమైంది. 15 రోజులపాటు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు రోజుల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం తిరిగి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందాడు. మృతునికి భార్య సత్తవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఎస్సై రమేశ్ తెలిపారు.

కోరుట్లలో ఒకరికి కత్తిపోట్లు

కోరుట్ల: కోరుట్లలోని రవీంద్రరోడ్‌లో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. దీంతో బాధితుడిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణానికి చెందిన ఇట్యాల సత్యనారాయణ (45) పోచమ్మ బోనాల సందర్భంగా రవీంద్రరోడ్‌లోని తమ సంఘం భవనం వద్ద ఉండగా ఇల్లుటపు గంగనర్సయ్య(40) అనే వ్యక్తి అకస్మాత్తుగా వచ్చి కత్తితో కడుపులో పొడిచినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పాత కక్షలు, గొడవలు కత్తిపోట్లకు కారణమని పేర్కొన్నారు.

రూ.3కోట్ల కారు.. ఊడిపోయిన టైరు

● మంత్రి కారుకు ప్రమాదంపై చర్చ
● భద్రతపై సందేహాలు..?



టైర్ ఊడిపోయి ప్రమాదానికి గురైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కారు

కోరుట్ల: ఆ కారు ఖరీదు ఇంచుమించు రూ.3 కోట్లు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నట్లు పేరున్న కారు. ఏదైనా ప్రమాదం జరిగి.. కారు పల్టీలు కొట్టినా పది ఏయిర్ బ్యాగులు తెరుచుకుని భద్రత విషయంలో ఏ మాత్రం బెదిరిపోవాల్సిన అవసరం లేదన్న ప్రచారం ఉంది. దీనికితోడు బులెట్ ప్రూఫ్. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఖరీదైన కారు టైరు చిన్నపాటి ప్రమాదంలో ఎలా ఊడిపోయిందని స్థానికంగా చర్చ నడుస్తోంది. కారులో ఉన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు అదృష్టవశాత్తు ప్రమాదం జరగలేదు. అదే సమయంలో రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన కారు భద్రతపై మాత్రం లెక్కలేని సందేహాలు వస్తున్నాయి.

అసలేం జరిగింది..?

శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మంత్రి అడ్లూరి వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి కోరుట్ల వచ్చారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో మెట్‌పల్లి నుంచి తిరిగి ధర్మపురి వెళ్లేందుకు తన కారులో బయలుదేరారు. 15 నిమిషాల్లో కారు మెట్‌పల్లిదాటి మారుతీనగర్ సమీపానికి చేరుకుంది. అదే సమయంలో దెబ్బతిన్న ఓ కారును కోరుట్లలోని మెకానిక్ షెడ్ నుంచి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి తీసుకువెళ్తున్న టోచన్ వాహనం ఎదురుగా వచ్చింది. రెండు వాహనాలు ఎదురెదురుగా చిన్నగా తగిలినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో అకస్మాత్తుగా మంత్రి కారు టైర్ ఊడిపోయింది. కారు టైర్ ఊడిపోవడం మినహా మంత్రి కారుకు ఎక్కడా ఎలాంటి గీత పడకపోవడం గమనార్హం. ఈ ప్రమాదంలో మంత్రి అడ్లూరి క్షేమంగా బయటపడగా.. టోచన్ వాహనంతో కారును తెస్తున్న వారిలో ఇమ్రాన్ అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే మెట్‌పల్లి పోలీసులు వచ్చి రెండు వాహనాలను అక్కడి నుంచి తరలించి కేసు నమోదు చేశారు.

భద్రత సంగతి దేవుడెరుగు..

మంత్రి కారులో ఉన్న ఆధునిక టెక్నాలజీ ప్రకారం ఏ పరికరంలోనైనా విడిభాగాలను బిగించే చిన్న చిన్న నట్లు, స్క్రూలు, ఇతరత్రా పరికరాల్లో కొంచెం తేడా వచ్చినా.. లూజు అయినట్లు ఉన్నా ప్రమాద సూచికలు ఇస్తుందని సమాచారం. శనివారం రాత్రి జరిగిన చిన్నపాటి ప్రమాదానికే ఫోర్ వీల్ డ్రైవ్ ఆటోమేటిక్ టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టం ఉన్న మంత్రి కారు టైరు ఎలా ఊడిపోయిందన్న అనుమానాలు వస్తున్నాయి. ఒకవేళ కారు టైర్ ముందుగానే కాస్త లూజ్ అయి ఉంటే దానికి సంబంధించిన ప్రమాద సూచికలు ఎందుకు రాలేదన్న సందేహాలు ఉన్నాయి. ఒకవేళ ప్రమాద సంకేతాలు వచ్చినా డ్రైవర్ సరిగా దృష్టి పెట్టలేదా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ముందస్తుగా ప్రమాదాన్ని నివారించే టెక్నాలజీ వ్యవస్థ సైతం ఈ కారులో ఉంది. అంతే కాకుండా ఈ వాహనం భద్రతా రేటింగ్ 5 స్టార్ కావడం గమనార్హం.

అవే కార్లు...

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంత్రుల కోసం ఇదే రకం 22 కార్లను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఖజానా లోటు ఉన్నా ఇంత లగ్జరీ కార్లు ఎలా కొనుగోలు చేశారన్న విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం అవే కార్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు కేటాయిస్తున్నారు. శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కేటాయించిన కారు కూడా అదే కావడం గమనార్హం.

పోయింది ఎక్కువ.. రికవరీ తక్కువ



ఇటీవల కమిషనరేట్‌లో రికవరీ చేసిన సెల్‌ఫోన్లతో పోలీస్ అధికారులు

● సెల్‌ఫోన్ రికవరీలో వెనుకంజ
● కమిషనరేట్‌లో పోయింది 6,683
● రికవరీ అయిన 2,020 సెల్ ఫోన్లు

గోదావరిఖని:పోయింది ఎక్కువ.. రికవరీ తక్కువ.. ఇదీ రామగుండం పోలీస్‌కమిషనరేట్‌లో సెల్‌ఫోన్ రికవరీ పరిస్థితి. వారసంతలు, బస్‌స్టేషన్లు, రద్దీప్రాంతాల్లో సెల్‌ఫోన్ ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు సంబంధిత సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లో నమోదు చేయడంతోపాటు సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. సెల్‌ఫోన్ చోరీ చేసిన దొంగలు మరో అడుగు ముందుకేసి ఐఎంఈఐ నంబర్ తొలగించి వినియోగిస్తుండటంతో బాధితులకు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు తిరిగి దక్కడం లేదు.

మొబైల్ ట్రాక్ ద్వారా రికవరీ

పోయిన సెల్‌ఫోన్ ఒరిజినల్ బిల్లుల ద్వారా ఐఎంఈఐ నంబర్‌తో ట్రాక్ చేస్తున్నారు. సెల్‌ఫోన్ కాల్స్‌పై ట్రాక్ రికార్డింగ్ ఉంచడం ద్వారా గుర్తిస్తున్నారు. అయితే కొందరు సిమ్ వేసి ఆన్‌చేయకుండా వీడియోగేమ్‌లు, ఇతర పనులకు వినియోగిస్తుండటంతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు రికవరీ కావడం లేదు.

దొరికేది తక్కువే..

సీఈఐఆర్ పోర్టల్ రంగప్రవేశంలో సెల్‌ఫోన్ చోరీలకు అడ్డుకట్టపడింది. అయినప్పటికీ రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 6,683 మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. వీటిలో 40శాతం మాత్రమే రికవరీ అయ్యాయి. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లలో 2020 సెల్‌ఫోన్ మాత్రమే రికవరీ అయ్యాయి.

ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక విభాగం

పోయిన సెల్‌పోన్ల రికవరీ కోసం రామగుండం పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేక విభాగాన్ని రామగుండం సీపీ అంబర్ కిశోర్‌ఝూ ఏర్పాటు చేశారు. ఎవరైన సెల్‌పోన్ కోల్పోతే వెంటనే సీఈఐఎంఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సంబంధిత పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరుతున్నారు. వీటిపై నిఘా కోసం సీసీఎస్, ఐటీ సెల్ విభాగాలు పనిచేస్తున్నాయి.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీనగర్‌కాలనీలోని వైభవ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఉదయం 8గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. స్పందించిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులోని సింగరేణి ఉద్యోగి బొంపెల్లి యాదగిరి ఇంట్లో కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకొని బెడ్‌రూం, హాల్ పూర్తిగా దగ్ధమైంది. గదులు పొగతో నిండిపోవడంతో యాదగిరి ఆయన భార్య రమాదేవి పొగ పీల్చి అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు దంపతులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అగ్నిప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు గోదావరిఖని ఫైర్ ఆఫీసర్ పి.లక్ష్మీనారాయణ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

వేములవాడరూరల్: మానసిక స్థితి, ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పండుగ బక్కవ్వ (65) అనే వృద్ధురాలు ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. వేములవాడరూరల్ మండలం మర్రిపల్లికి చెందిన బక్కవ్వ మానసికస్థితి సరిగా లేదు. ఇంటి ఆవరణలోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త నర్సయ్య, చిన్నకుమారుడు చింటు గతంలోనే మృతి చెందారు. మృతురాలికి పెద్ద కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకులం విద్యార్థులకు పురుగుల అన్నం



విద్యార్థులకు అందించిన భోజనంలో పురుగులు

వెల్గటూర్ : వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలోని బీసీ గురుకుల హాస్టల్ విద్యార్థులకు ఆదివారం పురుగులు పట్టిన భోజనం అందించడం కలకలం సృష్టించింది. పాఠశాలకు సందర్శనకు వెళ్లిన ఓ విద్యార్థి తండ్రి పురుగుల భోజనం చూడడంతో విషయం బయటకు తెలిసింది. గురుకులాల్లో తరచుగా నాసిరకం భోజనంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సందర్భంలో ఈ సంఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. ప్రతీరోజు బియ్యం శుభ్రం చేసిన తర్వాతే వండుతామని, ఆదివారం కావడంతో అధ్యాపకులు అందరూ సెలవులో ఉన్నారని, అందుకే పర్యవేక్షించలేదని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని తెలిపారు. నాసిరకం బియ్యం పాఠశాలలకు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన రామగోని వీరవ్వ(60) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. వీరవ్వ కొద్దికాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. సమస్య తీవ్రంకావడంతో, భరించలేక ఈ నెల 28వ తేదీన పురుగుల మందు తాగింది. బంధువులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వీరవ్వ కూతురు గౌతమి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హోమియోను మించిన వైద్యం లేదు

● స్వీయ అనుభవాన్ని వివరించిన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల
● కరీంనగర్‌లో హోమియో వైద్యుల ఐదో రాష్ట్రస్థాయి సైంటిఫిక్ సెమినార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్‌టౌన్: వైద్యరంగంలో హోమియోను మించిన చికిత్స లేదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని పద్మనగర్‌లో 5వ రాష్ట్రస్థాయి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ సైంటిఫిక్ సెమినార్‌ను ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సెమినార్లో కరీంనగర్‌కు చెందిన ప్రముఖ హోమియో వైద్యుడు కొడిత్యాల శ్రీనివాస్ లైవ్‌లో ఫిమేల్ ఇన్ఫెర్టిలిటీపై, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాతలాజికల్ ప్రిస్క్రిప్షన్‌పై, డాక్టర్ గణేశ్ ఆచారి కార్డియోమైపోతిపై, డాక్టర్ హీరాలాల్ అగర్వాల్ రేనల్ వ్యాధులపై, సైంటిఫిక్ సెమినార్ నిర్వహించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఇప్పటివరకు తన చేతుల మీదుగా వందల హాస్పిటళ్లు ప్రారంభించానని, హోమియో వైద్య సదస్సుకు రావడం ఇదే ప్రథమమన్నారు. ఈ సదస్సుకు తను ఇష్టంతో వచ్చానని అన్నారు. ఈ సందర్భంగా తన స్వీయ అనుభవాన్ని వివరించారు. మానేరు రివర్ ఫ్రంట్ స్టడీ కోసం సియోల్‌కు వెళ్లగానే తనకు విపరీతమైన దగ్గు వచ్చిందన్నారు. ఏ ఆసుపత్రికి వెళ్లినా తగ్గలేదని, ఒక మంత్రి సూచన మేరకు హోమియో వాడిన వారం రోజుల్లోనే పూర్తి రిలీఫ్ వచ్చిందని తెలిపారు. హోమియో వైద్యుల సంఘ భవన స్థలానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 2025–27 సంవత్సరానికిగానూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హరికృష్ణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గుజరాత్‌కు చెందిన డాక్టర్ నిశికత్ తాపే వ్యవహరించారు. కరీంనగర్ యూనిట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కొడిత్యాల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. హోమియోపతి వైద్యుల జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శివమూర్తి, చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.ఏ.రావు, డాక్టర్ ఎంఎన్ రాజు, డాక్టర్లు దీపక్ బాబు, ఎన్ఎస్.రెడ్డి, దయాకర్, దినకర్, రవికుమార్, రవీంద్రచారి, హస్సాన, కృష్ణకాంత్, 300మంది వైద్యులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



కనకయ్య మృతదేహం

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన పిల్లి కనుకయ్య(61) రోజూ మాదిరిగానే చేపలు పట్టేందుకు ఈనెల 28న ఎల్‌ఎండీలోని రిజర్వాయర్‌కు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు తెప్పపై నుంచి పడి నీళ్లలో పడి మునిగిపోయాడు. నరేడ్ల రవి అనేవ్యక్తి కనుకయ్య కుటుంబ సభ్యులకు, పోలీసులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి కుమారుడు పిల్లి సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

మత్స్యకారుడి గల్లంతు



గువ్వ రవి(ఫైల్)

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గువ్వ రవి(43) చేపలవేటకు వెళ్లి గల్లంతయ్యాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గువ్వ రవి చేపలు పడుతూ.. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామ సమీపంలోని లోయర్ మానేరు డ్యాం బ్యాక్ వాటర్‌లో ఆదివారం చేపల వేటకు వెళ్లాడు. తెప్పసాయంతో డ్యాంలో చేపలు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా వచ్చిన తీవ్రమైన గాలులకు తెప్ప తిరగబడటంతో నీటిలో పడి గల్లంతయ్యాడు. ఇది గమనించిన తోటి మత్స్యకారులు తెప్పలపై నీటిలో వెళ్లి గాలింపు చేపట్టగా ఆచూకీ లభ్యం కాలేదు. రవికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు పరిశీలించారు.

రాజన్నకు మొక్కులు





వేములవాడ: రాజన్నను ఆదివారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురవాలని, పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.